TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:54 SUNDAY ,JULY 05 ,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 54 ఆదివారం 05 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర..
## 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం



- హోంశాఖ పరిధిలోని పోలీస్, జైళ్లు, ఫైర్, ఎస్‌పీఎఫ్ విభాగాల్లో నియామకాలు
- ఇప్పటికే 5 వేల పోస్టులకు జీవోలు జారీ.. మరో 2 వేలకు త్వరలో ఉత్తర్వులు
- ఆర్థిక శాఖ అనుమతులు రావడంతో నోటిఫికేషన్‌కు సిద్ధమైన టీఎస్ఎల్‌పీఆర్‌బీ
- రాష్ట్రం ఏర్పడ్డాక ఇది నాలుగో అతిపెద్ద పోలీస్ రిక్రూట్‌మెంట్

# రాజకీయాల్లో 20 ఏళ్లు..
## భావోద్వేగ పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి



- రాజకీయాల్లో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి రేవంతన్నగా తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడిగా పని చేస్తానని హామీ
- తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

జూలై 4 హంసకలం వార్త

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. ప్రజా జీవితంలోకి అడుగు పెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు.

## మీరు నన్ను ఆపాలనుకుంటే.. చంపాల్సిందే..
## తిరుగుబాటుదారులకు మమత సవాల్..

జూలై 4 హంసకలం వార్త

రాజకీయంగా తనను అడ్డుకోవడం ఎవరి వల్లా సాధ్యంకాదని, తనను ఆపాలంటే తన ప్రాణాలు తీయాల్సిందేనని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. పార్టీని వీడి తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఆమె ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ అధికారిక గుర్తు తన వైపు ఉన్న నమ్మకస్థుల వద్దే ఉంటుందని చెప్పారు.



## ఖమేనీకి కన్నీటి వీడ్కోలు..
## పక్కనే 14 నెలల చిన్నారి శవపేటిక..

జూలై 4 హంసకలం వార్త

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ



## పీక్ అవర్స్‌లో మెట్రో ప్రయాణం మరింత కష్టం..
## పెరగనున్న నిరీక్షణ సమయం



- హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు పెరగనున్న నిరీక్షణ సమయం
- కొత్తగా 60 కోచ్‌ల కొనుగోలు ప్రక్రియలో రెండేళ్ల జాప్యం
- కేంద్రం నుంచి రాష్ట్రానికి బదిలీ ప్రక్రియ ఆలస్యం కావడమే కారణం
- పీక్ అవర్స్‌లో తీవ్ర రద్దీతో కొనసాగుతున్న ప్రయాణికుల ఇబ్బందులు
- వాల్యుయేషన్ పూర్తయ్యాకే కోచ్‌ల కొనుగోలుకు మార్గం సుగమం

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం..
## ఘాటుగా స్పందించిన కవిత

జూలై 4 హంసకలం వార్త

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది.



## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు:
## బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

- పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడికి బెయిల్ ఇవ్వొద్దన్న పోలీసులు
- హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిన దర్యాప్తు అధికారులు
- మైనర్‌ను లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు



హంస కలం వార్త
HAMSA KALAM VARTA
ఆదివారం 05 జూలై 2026

## రాజకీయాల్లో 20 ఏళ్లు.. భావోద్వేగ పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తు కార్యాచరణను ప్రజలతో పంచుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం మిడ్జిల్‌లో 'రేవంత్ రెడ్డి'గా మొదలైన తన ప్రస్థానం, నేడు ప్రజల ఆదరాభిమానాలతో 'రేవంతన్న'గా వారి గుండెల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ అద్భుత ప్రయాణం తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అభివర్ణించారు. ఈ 20 ఏళ్ల కాలంలో ప్రతి సంఘర్షణలో, ప్రజల కోసం తాను చేసిన ప్రతి పోరాటంలో అండగా నిలిచిన ఆత్మీయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో 'తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడి'గా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అన్నింటికీ మించి 'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇచ్చారు.

## మీరు నన్ను ఆపాలనుకుంటే.. చంపాల్సిందే.. తిరుగుబాటుదారులకు మమత సవాల్..

పార్టీని వీడి తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఆమె ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ అధికారిక గుర్తు తన వైపు ఉన్న నమ్మకస్థుల వద్దే ఉంటుందని చెప్పారు. శనివారం మమత మాట్లాడుతూ.. 'పార్టీ సింబల్ ఎక్కడికీ పోదు. మీరు నన్ను ఆపాలని అనుకుంటే.. నన్ను చంపాల్సిందే. చంద్రిమా భట్టాచార్య ఈ రోజు రాజీనామా చేశారు. ఆమె ఇక్కడి పరిస్థితులపై ముందుగానే నాకు సమాచారం ఇచ్చారు. రాజీనామా చేస్తానని కూడా చెప్పారు. ఆమె కుమారుడు యాంటీ తృణమూల్ గుంపులో చేరాడన్న కారణంతోనే చంద్రిమా భట్టాచార్య రాజీనామా చేశారు. అది ఆమె ఇష్టం. ఆమెకు ఆ స్వేచ్ఛ ఉంది. కానీ, నేను మాత్రం వాళ్లతో చేతులు కలపను. నేను బీజేపీ ముందు తలవంచను. బెదిరింపులకు నా పార్టీ లొంగదు' అని తేల్చి చెప్పారు.

**పార్టీ ఆఫీస్ స్వాధీనంపై మమత ఆగ్రహం..**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుంది. ఈ విషయంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ.. 'నిన్న తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లి దానికి తాళం వేసిన వారికి నేను ఒకటే చెబుతున్నాను. మేము ఆ కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్నాము.అది అక్టోబర్ 2027 వరకు మాకు లీజుకు ఇవ్వబడింది.

## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు: బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు

బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న భగీరథ్, తాను నిర్దోషినని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

## మెల్‌బోర్న్ పర్యటనకు ముందు ప్రధాని మోదీకి డెత్ వార్నింగ్

భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చాయి. మెల్‌బోర్న్ మీట్స్ మోదీ పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్ కోసం ఉద్దేశించిన ఒక ఫేస్ బుక్ పోస్టుకు కామెంట్ రూపంలో నిందితులు ఈ బెదిరింపులకు దిగారు. అబూ ముస్తాఫా పేరిట ఉన్న అకౌంట్ నుంచి నిందితులు ఈ పోస్టు పెట్టారు. 'స్టేడియం రూఫ్‌టాప్‌ను మూసేస్తే మంచిది. ఈ కార్యక్రమానికి మోదీ రావడమంటే మృత్యువు కోసం వస్తున్నట్టే' అని కామెంట్ చేశారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఈ పోస్టు వచ్చిందో గుర్తించారు. అయితే, ఈ ఉదంతంలో ఎవరినైనా అరెస్టు చేశారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనను తీవ్రంగా పరగణిస్తున్నామని ఆస్ట్రేలియా అధికారులు తెలిపారు. పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఇక ప్రధాని మోదీ జులై 8-10 మధ్య ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. జులై 9న మెల్‌బోర్న్ మీట్స్ మోదీ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా-ఇండియా వార్షిక సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు. ఈ సమావేశాల గురించి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథొనీ ఆల్బనీస్ ప్రకటించారు. భారత్ ఆస్ట్రేలియాకు గొప్ప వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామి అని అన్నారు.

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర.. 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పోలీస్ కొలువు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరదించుతూ, హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో భారీగా ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. పోలీస్, జైళ్లు, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) విభాగాలలో ఖాళీగా ఉన్న దాదాపు 7,000 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసే దిశగా, ప్రభుత్వం ఇప్పటికే 5,000 పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోలను జారీ చేసింది. మిగిలిన 2,000 పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించడంతో, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) సమగ్ర నోటిఫికేషన్ జారీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒకటి రెండు రోజుల్లోనే అభ్యర్థుల అర్హతలు, సిలబస్, పరీక్షల నిర్వహణ తేదీలతో కూడిన పూర్తి వివరాలను బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో కొత్త పోలీస్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, వయోపరిమితి సడలించాలని నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్న విషయం తెలిసిందే. వారి డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఈ నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా, పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేసేందుకు పోలీస్ బోర్డు అధికారులు విధివిధానాలను ఖరారు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత హోంశాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. స్వరాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 2015 చివరి రోజున 9,281 పోస్టుల భర్తీకి తొలి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత, 2018లో రికార్డు స్థాయిలో 1,217 ఎస్సై, 16,285 కానిస్టేబుల్ పోస్టులతో రెండో విడత భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మూడో విడతగా 2022లో 554 ఎస్సై పోస్టులు, 15,644 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టారు. ఇప్పుడు నాలుగో విడతలో భాగంగా మరో 7,000 ఉద్యోగాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో, పోలీస్ శాఖలో స్థిరపడాలని కలలు కంటున్న వేలాది మంది నిరుద్యోగుల ఆశలు మళ్లీ చిగురించాయి. త్వరలో వెలువడనున్న అధికారిక నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఖమేనీకి కన్నీటి వీడ్కోలు.. పక్కనే 14 నెలల చిన్నారి శవపేటిక..

దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళులర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరపున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హుస్సైనీన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## పీక్ అవర్స్‌లో మెట్రో ప్రయాణం మరింత కష్టం.. పెరగనున్న నిరీక్షణ సమయం

హైదరాబాద్ మెట్రోలో రద్దీ సమయాల్లో (పీక్ అవర్స్) ప్రయాణించే వారికి నిరీక్షణ తప్పేలా లేదు. రైళ్లలో రద్దీ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం లభించే అవకాశాలు కనిపించడం లేదు. కొత్తగా 60 కోచ్‌లను కొనుగోలు చేసే ప్రక్రియ సుమారు రెండేళ్ల పాటు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. మెట్రో ఫేజ్-1 నిర్వహణను కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసే ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఈ బదిలీ పూర్తయ్యాకే కొత్త కోచ్‌ల కోసం ఆర్డర్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పటికీ, కేంద్రం నుంచి వచ్చిన తాజా ఆదేశాలతో ప్రతిపాదన నిలిచిపోయింది. మెట్రో ప్రాజెక్టు విలువను మరోసారి అంచనా వేయాలని కేంద్రం ఆదేశించడంతో కోచ్‌ల కొనుగోలుతో పాటు ఇతర కీలక నిర్ణయాలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ ఈ వాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహిస్తోంది. ఇది పూర్తవడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చని, పూర్తి స్థాయి బదిలీ ప్రక్రియ 2026 చివరి నాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాతే బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌కు కోచ్‌ల తయారీ కోసం ఆర్డర్ ఇవ్వడం సాధ్యమవుతుంది. ఆర్డర్ అందిన తర్వాత కోచ్‌ల తయారీ, సరఫరాకు కనీసం 15 నెలల సమయం పడుతుందని సదరు సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజూ సుమారు 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్, నాగోల్-రాయదుర్గం, ఎల్బీ నగర్-మియాపూర్ వంటి మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, బదిలీ ప్రక్రియలోని సాంకేతిక అడ్డంకులు తొలగి కొత్త కోచ్‌లు అందుబాటులోకి వచ్చే వరకు ప్రయాణికులకు రద్దీ కష్టాలు తప్పేలా లేవు.

## పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం.. ఘాటుగా స్పందించిన కవిత

సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆమె చేసుకున్న దరఖాస్తుపై ఏకంగా వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని సీఈసీ వెల్లడించింది. పార్టీ పేరు మార్చాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ నమోదు ప్రక్రియ ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మరో మూడు ప్రత్యామ్నాయ పేర్లను తమకు సమర్పించాలని స్పష్టం చేస్తూ కవితకు అధికారికంగా లేఖ రాసింది. నిర్ణీత గడువులోగా కొత్త పేర్లు పంపకపోతే, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును క్లోజ్ చేస్తామని సీఈసీ ఆ లేఖలో కఠినంగా హెచ్చరించింది. ఈసీ పంపిన లేఖపై కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సంఘం లేఖలో పేర్కొన్న అభ్యంతరాలకు తాము ఇప్పటికే రాతపూర్వక సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఈసీ కోరినట్లుగా ప్రత్యామ్నాయంగా కొత్త పేర్లను పంపే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. 'తెలంగాణ రక్షణ సేన' పేరుపైనే తాము ముందుకు వెళ్తామని, అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘంపై కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధమని కవిత స్పష్టం చేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో కవిత తన కొత్త పార్టీ కోసం 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ జాగృతి', 'తెలంగాణ రక్షణ సేన', 'తెలంగాణ రాష్ట్ర జాగృతి', 'తెలంగాణ ప్రజా శక్తి' అనే ఐదు పేర్లను ఈసీకి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏప్రిల్ 25న మునీరాబాద్‌లో భారీ ఎత్తున నిర్వహించిన ఆవిర్భావ సభలో... తమ పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేన' అని కవిత స్వయంగా ప్రకటించి, పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అయితే, ఆ తర్వాత కేవలం మూడు రోజుల వ్యవధిలోనే (ఏప్రిల్ 28న) ఈ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా మారుస్తూ, ఈ పేరుపై నెల రోజుల్లోగా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరుతూ పత్రికల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. మూడు రోజుల్లోనే 'రాష్ట్ర సేన' కాస్త 'రక్షణ సేన'గా ఎందుకు మారిందనే దానిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. ప్రస్తుతం 'తెలంగాణ రక్షణ సేన' పేరుతోనే కవిత కేడర్‌ను సమాయత్తం చేస్తూ ప్రజా క్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తుండగా... ఇప్పుడు ఏకంగా వేల సంఖ్యలో అభ్యంతరాలు రావడం, ఈ ఈసీ స్పందన నేపథ్యంలో ఈ పేరు కవితకు దక్కుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

## బండ్ల గణేష్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ.. ఆస్తి వేలాన్ని సమర్థించిన న్యాయస్థానం

ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన కుటుంబానికి చెందిన ఆస్తి వేలాన్ని సమర్థిస్తూ ఉన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపట్టిన వేలం ప్రక్రియ చట్టబద్ధమేనని స్పష్టం చేస్తూ, రికవరీ చర్యలతో ముందుకు వెళ్లవచ్చని బ్యాంకుకు అనుమతినిచ్చింది. ఈ వేలాన్ని రద్దు చేస్తూ గతంలో డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు తాజాగా కొట్టివేసింది. వివరాల్లోకి వెళ్తే.. బండ్ల గణేష్, ఆయన తండ్రి, సోదరుడు ప్రమోటర్లుగా ఉన్న 'శ్రీ పరమేశ్వర పౌల్ట్రీ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ కోసం యూనియన్ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్నారు. ఈ రుణాలకు పూచీకత్తుగా జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట్‌లో ఉన్న సుమారు 500 గజాల నివాస భవనాన్ని తాకట్టు పెట్టారు. ఈ రుణాలకు సంబంధించి కుటుంబ సభ్యులు వ్యక్తిగత హామీదారులుగా ఉన్నారు. రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో, సర్ఫేసీ చట్టం కింద బ్యాంకు 2019లో ఆస్తిని స్వాధీనం చేసుకుని, 2022లో వేలం వేసింది. ఈ వేలంలో సదరు ఆస్తి రూ. 8.51 కోట్లకు విక్రయించబడింది. అయితే, ఈ వేలాన్ని డీఆర్‌టీ రద్దు చేయడంతో, యూనియన్ బ్యాంక్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మౌషూమి భట్టాచార్య, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం, బ్యాంకు వాదనలతో ఏకీభవించింది. డీఆర్‌టీ ఉత్తర్వులను



రద్దు చేస్తూ, బ్యాంకు చేపట్టిన వేలం ప్రక్రియ చెల్లుబాటు అవుతుందని శుక్రవారం తీర్పు వెలువరించింది. హైకోర్టు తాజా తీర్పుతో బ్యాంకుకు రికవరీ ప్రక్రియలో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి.

# సంపాదకీయం

## ఎన్ని పుట్టినరోజులైనా విరసం ఇంతేనా?

విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 5న విరసం వాళ్ళు చాలా సంబరంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా 'భారతదేశంలో ఫాసిజం -- ప్రత్యేకతలు' అని ఒక కరపత్రం విడుదల చేసారు. 1500 పదాల ఈ కరపత్రంలో 'బ్రాహ్మణీయ' అనే పదం మూడుసార్లు మాత్రమే వచ్చింది. 'పెట్టుబడి', 'పెట్టుబడిదారీ', 'దళారీ', 'బూర్జువా', 'అర్ధ వలస' పదాలు మాత్రం ముప్పైసార్లు వచ్చాయి. భారతదేశంలో ఫాసిజం కేవలం 'బూర్జువా', 'అర్ధ వలస--అర్ధ భూస్వామ్య' లతో మాత్రమే ముడిపడి ఉన్నదా? ఫాసిజం గురించి చెప్పమన్నా, కుల వ్యవస్థ గురించి చెప్పమన్నా, అదానీ, అంబానీ లాంటి సోఫిస్టికేటెడ్ కార్పొరేట్ దురాక్రమణ గురించి మాట్లాడమన్నా -- విరసం ధోరణి అటు తిరిగి ఇటు తిరిగి 'బూర్జువా', 'అర్ధ వలస అర్ధ భూస్వామ్య'ల దగ్గరకే వచ్చి ఆగిపోతుంది. అసలు 'ఫాసిజం' అంటే ఏమిటి? క్లుప్తంగా చెప్పుకుంటే-- నిరంకుశ లేదా నియంతృత్వ పాలన. ఫాసిస్ట్ పాలనలో సామాన్యంగా కనపడే లక్షణాలు-- అతివాద జాతీయవాదం, రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, పౌర హక్కులకూ స్వేచ్ఛలకూ పరిమితులు విధించడం, వ్యక్తులూ సంస్థలూ తమ స్వప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే లోబడాలని ప్రభుత్వం బలవంతపెట్టడం, అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అబద్ధ ప్రచారాన్నీ (ప్రొపగాండా) బలప్రయోగాన్నీ తరచుగా వాడటం... మొదలైనవి. ఇది ముస్సోలిని పుణ్యమా అని ముందుకు వచ్చిన పొలిటికల్ ఐడియాలజీ. వ్యక్తులందరూ ఒకే జాతీయ సమూహంగా ఏకమవ్వాలి, వ్యక్తికంటే దేశమే గొప్పది, ఆ ఏకీకృత దేశాన్ని ఒక బలమైన కేంద్రీయ ప్రభుత్వం నడిపించాలి అనే విలువలను భూమికగా చేసుకుని ఫాసిజం పని చేసింది. ఇక మన దేశంలో దేశంలో ప్రస్తుత ఫాసిస్ట్ భావజాలం ఎవరి అధికార కాంక్షను కాపాడడానికో అర్థం చేసుకోవటం సులభమే. కానీ 'బూర్జువా', 'వలస వాదం', 'భూస్వామ్య వాదం', 'పెట్టుబడీదారీ వాదం' లాంటి పదాలను విరసం వాళ్ళు ఆంజనేయ దండకంలా యాంత్రికంగా వాడటమే తప్ప ఈ దేశంలో ఫాసిజం మౌలిక లక్షణాల్ని చెప్పడానికి ఎందుకు మొహమాటపడుతున్నారో అర్థం కాదు. కాంగ్రెస్ కాలంలో ఉన్న ఫాసిజానికి, బెంగాల్‌లో సీపీఎం కాలంలో ఉన్న ఫాసిజానికి, నేడు సంఘ్ పరివార్ శక్తుల హయాంలో ఫాసిజానికి తేడా లేదా? ఇప్పుడు ఉమర్ ఖలీద్‌కు బెయిల్ రాదు కానీ ఆశారం బాపూకు, డేరా బాబాకు బెయిల్ వస్తుంది. ఇంకో పక్క కేంద్ర గిడ్డంగి-- అనుబంధ గిడ్డంగుల విధానాన్ని మార్చివేసి 130 టెండర్లు పిలిస్తే, అందులో 110 టెండర్లు అదానీకే వస్తాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి చట్టాలను ఉల్లంఘించనక్కర్లేదు, పాటించాల్సిన నియమాలను మారిస్తే చాలు. అప్పుడిక ఫలితం ముందే నిర్ణయించబడిన ఆటగా మారుతుంది. 5.5 లక్షల కోట్ల విలువైన వ్యాపారం చేస్తున్న వేదాంత గ్రూప్ చైర్మన్ "దేశంలో అత్యంత క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఈ ప్రభుత్వం ఒక్కరికే (అదానీ) ధారాదత్తం చేస్తున్నది" అని స్టేట్‌మెంట్ ఇస్తే, మరుసటి రోజే ఆయన కంపెనీ మీద ఈడీ దాడులు జరిగాయి. ఇది కేవలం పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడటం కోసమే కాదు. అదే అయితే కేవలం అదానీ కోసమే నియమాలు మార్చాల్సిన అవసరం లేదు. ఇప్పుడిది 'క్రోనీ కేపిటలిజం' స్థాయిని కూడా దాటేసింది. ఇంకా దీన్ని పట్టుకుని విరసం వాళ్ళు "దళారీ బూర్జువా విధానం" అని పాతచింతకాయ పచ్చడి మాటలు వాడుతునే ఉన్నారు. అసలు పెట్టుబడీదారీవిధానం అంటేనే లాబీయింగ్ ఉండితీరుతుంది. మళ్ళీ దానికి 'దళారీ' అని ఏదో అమెరికా వాళ్ళో, చైనా వాళ్ళో మన ఆర్థిక స్థితిని తారుమారు చేస్తున్నట్టు రాయడం ఏమిటి? 'యే టాటా కౌన్ రే, యే బిర్లా కౌన్ రే' అని ఎగిరిన వాళ్ళు కాస్తా ఇప్పుడు సడన్‌గా అదానీ పిక్చర్‌లోకి వచ్చేసరికి "అరేయ్! ఇదేంటి 2000 వరకు అదానీ ఎవరో తెలీదు. ఎలా పుట్టుకొచ్చాడు. ఎవరు పెంచి పోషించారు?" అని నాలుక కొరుక్కుంటున్నారు. అసలు ఇప్పుడున్న పెట్టుబడీదారీ లక్షణాన్ని సమూలంగా అర్థం చేసుకోవడంలో తడబడుతున్నారు. అలాగే ఏదో 'ఆవు' వ్యాసం లాగ "అర్ధ భూస్వామ్య--అర్ధ వలస రాజ్య సమాజంలో ఫాసిజం వస్తే ఎట్లా ఉంటుందో హిందుత్వ కార్పొరేట్ ఫాసిజంలో చూడవచ్చు" అని రాస్తారు. 'అర్ధ వలస' అంటే ఏమిటి? ఇప్పటి అదానీ మోనోపోలీని వదిలేసి మన దేశంలో అంతకంటే చిన్న సమస్య అయిన వలసవాదం గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? వలసవాదం ప్రతి వెనుకబడిన దేశం లోనూ ఉంటుంది. ఎందుకంటే -- అక్కడ పెట్టుబడి ఎక్కువ అందుబాటులో ఉండదు. వేరే దేశాల పెట్టుబడుల మీద ఆధారపడిన ప్రతి ఎకానమీ పరిస్థితి ఇంతే! మరి విరసం వాళ్లకు ఇక్కడి ప్రయారిటీస్ తెలీవా? లేక తెలీనట్టు నటిస్తారా? ప్రతి 'అర్ధ భూస్వామ్య--అర్ధ వలస దేశం'లో హిందూత్వ కార్పొరేట్ ఫాసిజం ఉందా లేక మన దేశంలోనే ఉందా? ఉంటే ఎందుకుంది? ఇక్కడి ప్రత్యేకతలు ఏంటి? ఇవన్నీ వదిలేసి 'అర్ధ వలస' అని ఊకదంపుడుగా రాయడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఇలాంటి వాళ్ళు సమాజాన్ని సమూలంగా మారుస్తాం అని చెప్తూ ప్రజలు నమ్మాలని ఆశించడం, నమ్మకపోతే రాజ్యం ఏజంట్స్ అనో, కార్పోరేట్ విషపురుగులు అనో ముద్ర వేయడం! ఇలాంటి విషయాల్లో-- కుక్కని చంపే ముందు అది పిచ్చిదని ముద్ర వేయాలి అన్న ఫాసిస్ట్ సూత్రాన్నే వీళ్ళూ అనుసరిస్తారు."భారతీయ రాజకీయ ఆర్థిక చరిత్రలో భాగంగా ఏర్పడిన బ్యూరాక్రటిక్ దళారీ పెట్టుబడీదారీ విధానం నుంచి ఫాసిజం వచ్చింది" అని రాస్తారు! దేశ రాజకీయ ఆర్థిక చరిత్రను అధ్యయనం చేయకుండా బాధ్యతారహితంగా మాట్లాడే మాటలు ఇవి. ఈ కరపత్రంలో వాక్యం వాక్యానికీ ఉండే అయోమయాన్ని బైట పెట్టాలంటే ఇక్కడ స్థలం సరిపోదు. విరసం కులాన్ని నిర్మాణాత్మక సమస్యగా చూడ్డం ఇప్పటికీ అలవాటు చేసుకోలేకపోయింది. బ్రాహ్మణీయ హిందూత్వ సమూల స్వరూపాన్ని ఛేదించలేక ఇప్పటికీ అవే 'ఆవు' వ్యాసాలు రాసుకుంటోంది!

# ఫిరాయింపులు : కొత్త బెంగాలీ కథ!










రాజకీయాలలో ఎంత దిగువకు దిగజారితే అథఃపాతాళానికి చేరుకున్నట్టు? ఇది రాజకీయ ప్రశ్న కాదు, సామాజికమే. రాజకీయ నాయకులు అవకాశవాదంతో పార్టీలు ఫిరాయించడానికి ఎప్పటికప్పుడు కొత్త దారులు కనిపెడుతున్నారు... యథేచ్ఛగా ఆ దారిన పరుగులు తీస్తున్నారు. ఈమధ్యే చోటుచేసుకున్న పశ్చిమ బెంగాల్ పరిణామాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. దశాబ్దంన్నర పాటు ఏకఛ్ఛత్రాధిపత్యం సాగించిన మమతా బెనర్జీని ప్రజలు ఇంటికి సాగనంపారు. ఇది ప్రజాస్వామ్యంలో సహజ పరిణామం. ఏదో ఒక్క రాజకీయ పక్షాన్నో, ఒకే ఒక్క రాజకీయ నేతనో ప్రజలు శాశ్వతంగా అధికారంలో ఉండనివ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ ఒక పార్టీ అండతో గెలిచినవారు, ఒక్క ఉదుటున గీత దాటిపోతే... మరి వారి రాజకీయ విధేయత సంగతి ఏమిటి? రాజకీయ అధికారం, సామాజిక హోదా కల్పించిన మాతృసంస్థతో కలిసి నడవాలా, అక్కరలేదా? రాజకీయ నడతలో నైతికతకు స్థానం ఉండనక్కరలేదా? ఎన్నికలలో ప్రజలు ఒక పార్టీని ఇంటికి పంపగానే అప్పటివరకూ ఆ పార్టీలో ఉండి రాజకీయాలను నడిపించిన వ్యక్తులు ఒక్కసారిగా, మూకుమ్మడిగా కొత్త దారులు అన్వేషించడాన్ని సామాజిక పరిశోధకులు ఎలా నిర్వచిస్తారు? దీనిని అధినాగరిక లక్షణంగా పునర్నిర్వచించడానికి కొలమానం ఏమైనా ఉన్నదా? ఈ దేశంలో పార్టీ ఫిరాయింపు రాజకీయాలు కొత్తేమీ కాదు, కానీ అందుకు కూడా కొన్ని పద్ధతులను పాటించడం గతంలో చూశాం. ఇప్పుడు మార్గం మారింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నాయకత్వంలో అప్రతిహతంగా ఏలుబడి సాగించిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజాగ్రహాన్ని చవిచూసింది. గతంలో ఆ పార్టీ టిక్కెట్టుపై గెలిచి సగర్వంగా పార్లమెంటు మెట్లు ఎక్కిన 20 మంది సభ్యులు రాత్రికి రాత్రి ఎన్సీపీఐ (నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా) అనే పార్టీలోకి వెళ్లిపోయారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది అసెంబ్లీ ఎన్నికలలో కదా..., కానీ ఇప్పుడు పార్టీ మారిన వారు అసెంబ్లీ సభ్యులు కారు, వారు పార్లమెంటు సభ్యులు. తృణమూల్ నాయకత్వంపై అసంతృప్తి ఉంటే, నాయకత్వంపై తిరుగుబాటు అవసరం అనుకుంటే గతంలో ఎప్పుడో ఈ పని చేసి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు. సరే, పశ్చిమ బెంగాల్లో చక్రం తిప్పిన తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఎన్సీపీఐలోకి వెళ్లిన వారికి, పాత పార్టీలో కనిపించని ఉత్తేజపూరితమైన సైద్ధాంతిక బలం ఏమైనా కొత్త పార్టీలో కనిపించిందా అంటే అటువంటిదేమీ ఉన్నట్టు లేదు. అసలు ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ అంతటి రాష్ట్రాన్ని నడిపించినంతటి పెద్ద పార్టీ నుంచి మరో పార్టీలోకి వీరు వెళ్లారంటే అదింకా ఎంత పెద్ద పార్టీయో కదా అని అనిపిస్తుంది. కానీ ఆరా తీస్తే చాలా ఆశ్చర్యకరమైన సంగతులు తెలుస్తాయి. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా అనే పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో అసలు మూలాలే లేవు. ఆ పార్టీ వెనుక ప్రజలు లేరు, ఆ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కార్యకర్తలు లేరు. కలకత్తాలో ఒక చిన్న ఆఫీసు మాత్రమే ఉందట. పోనీ గతంలో ఏమైనా పెద్ద రాజకీయ చరిత్ర ఉందా అంటే అదీ లేదు. ఇప్పుడు 20 మంది పార్లమెంటు సభ్యులను తనలోకి ఇముడ్చుకున్న ఆ బుజ్జి రాజకీయ పక్షానికి పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో సైతం ఎన్నడూ పోటీ చేసిన చరిత్ర లేదు. అప్పనంగా 20 మంది ఎంపీల రాక ఓ హఠాత్ పరిణామం. దాంతో అసలు ఎక్కడా ఏ రూపంలోనూ ప్రాతినిధ్యమే లేని ఓ చిన్న రాజకీయ పక్షం ఉన్నట్టుండి ఒక్కసారిగా పార్లమెంటులో ఒక పెద్ద పార్టీగా రాత్రికి రాత్రి అవతరించేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ మిత్రపక్షాలలో ఇప్పుడు అగ్రతాంబూలం ఈ బుజ్జి పార్టీదే. ఇంతా చేస్తే దీని వయస్సు ముచ్చటగా మూడేళ్లే. గతంలో ఈ పార్టీ తరఫున నలుగురు త్రిపుర అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తే.. ఒక్కొక్కరికి వచ్చిన ఓట్లు నాలుగైదు వందలకు మించలేదు. అప్పట్లో ఆ పార్టీ నినాదం మాత్రం చాలా ఆకర్షణీయంగా ఉంది. 'మీ ఓట్లను కాపాడుకోవడానికి పార్టీ ఫిరాయింపుదారులను తిప్పికొట్టండి' అని ప్రజలకు సందేశం ఇచ్చిన నినాదం అది. ఎంత బాగుందీ నినాదం! ఆదర్శప్రాయమైన ఒక నినాదాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ఆ పార్టీ నేతలు చేసిన కృషిని ఆ పార్టీకి వచ్చిన ఓట్ల సంఖ్యతో బేరీజు వేయనక్కరలేదు గానీ, జరిగిన పరిణామాలను బట్టి చూస్తే మాత్రం ఆ నినాదానికీ, తదుపరి పరిణామాలకూ ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఏడు కిరణాల మధ్య జిగేల్‌మని మెరుస్తున్న పాలీని ఎన్నికల గుర్తుగా ఎంచుకున్న ఈ పార్టీకి విరాళాలు కూడా వచ్చాయి. వచ్చిన లక్షా పదివేల డెబ్బై అయిదు రూపాయలలో ఖర్చులు పోగా, ఇంకా డెబ్బై అయిదు రూపాయలు బ్యాంకు ఖాతాలో నికరంగా మిగిలే ఉన్నాయి. బాగుంది. విరాళాల దుర్వినియోగం జరగనే లేదు. ఈ విశేషాలను బట్టి చూస్తే.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్సీపీఐలోకి వచ్చిన వారు ఆ పార్టీ నినాదం చూసి ఆకర్షితులై ఇందులోకి వచ్చారనుకోవడానికి ఇసుమంత ఆధారం కూడా కనిపించడం లేదు. మరి ఎందుకు మారినట్టు? పార్టీ ఫిరాయింపుదార్లుగా ముద్ర పడకూడదనే ఉద్దేశంతోనే, వారు మూకుమ్మడిగా పార్టీ మారారన్నది చెప్పకనే చెబుతున్నది. అంత అవసరం ఏమొచ్చిందీ అంటే... అసలు సిసలు తృణమూల్ కాంగ్రెస్ తమదేనని, కాబట్టి తమనే అసలైన తృణమూల్‌గా గుర్తించాలని ఈ 20 మందీ వెళ్లి ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించాలి. ఎన్నికల కమిషన్ అవునని అంగీకరించడానికి చాలా కసరత్తు చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా సమయం. ఈ డిజిటల్ యుగంలో దీర్ఘకాలం ఎదురుచూసే సహనశీలురు అరుదు. అందుకే ఒక్క దెబ్బతో-- ఒక కొత్త వ్యూహంతో-- పాత మిత్రులతో కలిసి కాక, పార్లమెంటులో విడిగా ప్రత్యేకంగా కూర్చునే వీలును సాధించుకున్నారు. బాగు బాగు... మామూలుగా అయితే ఒక రాజకీయపక్షం మాత్రమే మరో పార్టీలో విలీనం కావచ్చు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆ కొత్త పార్టీలో తమ పాత పార్టీ విలీనం అయ్యింది కనుక తామూ అందుకు అంగీకరిస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అప్పుడు ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. కానీ ఇప్పుడు మూడింట రెండు వంతుల మంది మేము ఫలానా పార్టీలో చేరిపోయామని ప్రకటించుకోవడం వల్ల అనేక విధాలుగా అందరికీ శిరోభారం తగ్గినట్టే. మమతా బెనర్జీ ఆశ్రిత పక్షపాతానికి బందీ అయ్యుండవచ్చు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఖాతరు చేయకపోయి ఉండవచ్చు, అవినీతిని అరికట్టలేకపోయి ఉండవచ్చు, ఆమె నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడానికి మరెన్నయినా కారణాలు ఉండవచ్చు. కానీ వాటిని వ్యతిరేకించేవారు ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాలనే ఆచరణలోకి తెచ్చి ఉండవచ్చు. కానీ అలా జరగకపోవడాన్ని సమాజం కూడా ఆక్షేపిస్తున్నట్టు లేదు. నాయకులలోని అప్రజాస్వామిక వర్తన చూస్తే సమాజానికి చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. ఒకప్పుడు ఇటువంటి పరిణామాలు సంభవించినప్పుడు ప్రజలు ఈసడించుకునేవారు. చెట్టు కిందో, గట్టు మీదో కూర్చుని వార్తా పత్రికలు పట్టుకుని మరీ ఇందులోని మంచి-- చెడు గురించి చర్చోపచర్చలు చేసేవారు. ఎవరికి తోచిన పద్ధతిలో వారు ఇటువంటి పరిణామాల పట్ల ఏదో ఒక స్థాయిలో నిరసన ధ్వని వినిపించేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి మాయమైపోయింది. ఇది కూడా ఆకస్మికంగా జరిగింది కాదు. ఇది మనకు మామూలే. ఆ రోజుల్లో చీటికీ మాటికీ పార్టీలు మారే వారిని ఉద్దేశించి ఆయారాం, గయారాం అనేవారు. హర్యానా శాసనసభ్యుడు గయా లాల్ కేవలం పదిహేను రోజులలో ముచ్చటగా మూడు పార్టీలు ఫిరాయించడంతో ఈ శకం ప్రారంభమైంది. అది ఒక రకమైన తిట్టు. అయితే దేశ రాజకీయాలలో శ్రీరామునికి ఉచితాసనం ఇవ్వడం మొదలయ్యాక ఆయారాం, గయారాం అనడానికి ఎవరైనా సంశయించవలసివస్తోంది. అంత తేలికగా నోరు పెగలడం లేదు. అలనాటి ఫిరాయింపు క్రీడలో భజన్‌లాల్ ఉదంతం మరీ విచిత్రం. హర్యానా మంత్రిమండలి మొత్తం ఏకబిగిన జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి దూకడం పెద్ద సంచలనం సృష్టించింది, పెనుదుమారం మిగిల్చింది. ఫిరాయింపు ప్రహసనం పుణ్యమా అని దేశంలో ఉన్నట్టుండి కుప్పకూలిన రాష్ట్ర ప్రభుత్వాల సంఖ్య 45 వరకూ ఉంటుందని విశ్లేషకులు తేల్చారు. భారత రాజకీయాలలో ఒకప్పుడు హెచ్.ఎన్ బహుగుణ అనే నాయకుడు ఉండేవారు. దేశం మొత్తం మీద ఎక్కువ సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన రాజకీయ నాయకుడు ఎవరు అంటే.. మొట్టమొదట ఈ బహుగుణ పేరే వినవచ్చేది. ఊ.. అంటే పార్టీ మారడం, ఆ.. అంటే పార్టీ మారడం. ఇదేమిటయ్యా అంటే దానికీ ఆయన ఓ దీటైన, సజావుగా ధ్వనించే సమాధానం చెప్పేవారు. ప్రజల పట్ల బహుగుణకు గల అంకితభావం గురించి ఆయన కుమార్తె ఒక పుస్తకమే రాసినా, చీటికీ మాటికీ పార్టీలు మారడాన్ని ప్రజలు ఆమోదించిన దాఖలా మాత్రం లేదు. అప్పటి పరిస్థితినీ, ఇప్పటి పరిస్థితినీ ఒక్కసారి పోల్చుకుంటే ప్రజాస్వామిక ప్రయాణంలో మనం చాలా దూరం వచ్చేసినట్టే కనిపిస్తున్నది. ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకోవడానికి ఇప్పటి పశ్చిమ బెంగాల్ కథ లాగా... ఊరూ పేరూ లేని పార్టీలలోకి ఇలా మూకుమ్మడిగా చేరిపోతే, వారిని ఎన్నుకున్న ఓటర్లు సైతం ఆక్షేపించక మిన్నకుంటే ప్రజాస్వామ్య భావనల భవిష్యత్తు అయోమయంలో పడినట్టు కాదా? వచ్చేపోయేవారిని రా రమ్మని పిలవడానికి తలో రాజకీయ అంగడి పెట్టుకోవడానికి మార్గం సుగమం చేసినట్టు కాదా? కిం కర్తవ్యం...?!

# ప్రతి ఓటరు ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఓలు, బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకం : బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

( జూలై - 4- హంస కలంవార్త )

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో శనివారం రోజు 132-జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు.

**-ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ...**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం ప్రతి 20 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ అని, కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బీఎల్ఓలు, బీఎల్ఏలు సమగ్ర సమాచారం సేకరించి ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా ప్రతి ఓటరికి అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా



తీసుకుంటున్నందున, అప్పటి ఓటర్ల వివరాలు, ప్రస్తుతం వారి ఓటు హక్కు ఎక్కడ నమోదై ఉందనే సమాచారాన్ని ప్రజలు బీఎల్ఓలు, బీఎల్ఏలకు అందించాలని కోరారు. తద్వారా సమగ్ర, పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మృతి చెందిన వారి ఓట్లు , డూప్లికేషన్ ఓట్లు, షిఫ్టింగ్ ఓట్ల గుర్తింపులో ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా పూర్తి చేసే అవకాశం కల్పించడం ప్రజలకు ఎంతో సౌకర్య వంతంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వచ్ఛందంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఆర్ఎస్ నాయకులు చురుకుగా పాల్గొంటూ బిఎల్వో లు, బిఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలను ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంపై చైతన్య పరచాలి. ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించడం ప్రజలతో పాటు బీఎల్ఓలు, బీఎల్ఏలపై ఉన్న అత్యంత బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ బి.రాజేష్, ఆర్ఐ విజయ్, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పలు కాలనీల నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

# భారత "స్వాతంత్ర్య సమరంలో" ప్రముఖ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు

( జూలై - 4- హంస కలంవార్త )

129వ జయంతి సందర్భంగా కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని విగ్రహం వద్ద "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్" దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి "ఆల్విన్ కాలనీ 246 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు" పట్వారీ శశిధర్ వారి విగ్రహానికి పూల మాల వేసి, కొబ్బ రికాయ కొట్టి ఘననివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "అల్లూరి సీతారామరాజు" గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయనను "మన్యం వీరుడు" అని పిలుస్తారు. బ్రిటిష్ ప్రభుత్వం వల్ల గిరిజనులు పడుతున్న బాధలు చూసి వారికి నాయకత్వం వహించి చిన్న వయసులోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిన గొప్ప నాయకుడు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తన ధైర్యం, దేశభక్తి, త్యాగంతో భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు" అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహిళలు, కాలనీవాసులు, అభిమానులు,యువకులు మరియు టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు..



# మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా

( జూలై - 4- హంస కలంవార్త )

79వ జయంతి సందర్భంగా శనివారం రోజు కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కూకట్ పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ,నాయకులు గంధం రాజు ,రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్ రెడ్డి,




కిలారు శ్రీనివాస్ బాబు, రాజేష్ గౌడ్, నళిని కాంత్ ,బాలరాజు, రాము, నవీన్ , కామినేని వాసు,వనజ ,సుజాత, వాణి, అరుణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మోహనరంగా గారికి ఘన నివాళులు అర్పించారు.

# కూకట్ పల్లి కె.పి.హెచ్.బి. టెంపుల్ బస్ స్టాప్ దగ్గర నిర్వహించిన

**-పముఖ నాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి**

( జూలై - 4- హంస కలంవార్త )

వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగవీటి మోహ నరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడని, ఆయన సేవలు మరియు ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి



చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి మురళి, యం. భారత్ కుమార్, వల వల నాయుడు, వున్నా రావు, తిరుపతి రావు, రాజేష్ రాయ్, జున్ను



సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, నర్సింహా నాయి, వెంకటేశ్వరా, ప్రసాద్ తదితరులు పాల్గున్నారు.

## కీర్తి శేషులు వంగ వీటిమోహన్ రంగా కి ఘన నివాళులు అర్పించిన జనసేన నాయకులు: ప్రేమ కుమార్

( జూలై - 4- హంస కలంవార్త )

శనివారం రోజు కె పి హచ్ బి కాలనీ హౌసింగ్ బోర్డ్ టెంపుల్ బస్టాండ్ దగ్గర కూకట్ పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కీర్తిశేషులు వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి కార్య క్రమమునకు ముఖ్య అతిథిగా కూకట్ పల్లి జనసేన పార్టీ కంటెస్ట్ డ్ ఎం.ఎల్.ఏ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని రంగా విగ్ర హానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, రంగా అభిమానులు, ఇతర పార్టీ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్ భవన్ లో...

**-ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు**

**-నివాళులర్పించిన ఈడీ ఎం. రాజశేఖర్, అధికారులు, సిబ్బంది**



( జూలై - 4- హంస కలంవార్త )

మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు టిజిఎస్ఆర్‌టిసి బస్ భవన్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ముందుగా టిజిఎస్ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని శ్లాఘించారు. "రోశయ్య అత్యంత సుదీర్ఘకాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, ఎన్నో బడ్జెట్‌లను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని, ఆయన ఆర్థిక క్రమశిక్షణ, పరిపాలనా దక్షత నేటి తరానికి ఆదర్శ మని కీర్తించారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఆయన తీసుకున్న నిర్ణయాలు, ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎఫ్ఏ ట సీఏవో శ్రీమతి విజయ పుష్ప , సీఎమ్ఈ జానీ రెడ్డి, సీసీఈ కవిత, పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని రోశయ్య సేవలను స్మరించుకుంటూ అంజలి ఘటించారు.

# భరత్ నగర్ కాలనీ లో



( జూలై 4 హంసకలం వార్త )

SIR లో బాగంగా ఈ డబ్ల్యూ ఎస్ ప్రాంతములో ఇంటింటికి తిరుగుతూ అప్లికేషన్ ఫామ్ లను అందచేస్తూ వారికి సర్ గురించి అవగాహన కల్పిస్తున్న స్తానిక బి ఎల్ ఓ మరియు బి ఎల్ వో లు ఇట్టి కార్యక్రమం లో కాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి, సభ్యులు నాగేశ్వర్ రావు, వెంకటేష్ యాదవ్ సంతోష్ రాజు లు పాల్గొన్నారు

## వంగవీటి మోహనరంగ జయంతి సందర్బంగా



( జూలై - 4- హంస కలంవార్త )

నివాళ్ళు అర్పించిన జిల్లా గణేష్ నేత . ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ప్రముఖ నాయకుడిగా పేరుగాంచిన వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా, నేడు ఆల్విన్ డివిజన్ ఎల్లమ్మబండలో వంగవీటి మోహన్ రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్లోని అధ్యక్షులు శ్రీనివాస్ తోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత కార్యకర్తలతో కలిసి ఆయనకు నివాళ్లు అర్పించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేసి పేదల సంక్షేమం, భూమి పట్టాల పంపిణీ, ప్రజల సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టి, ప్రజా సమస్యలు తీర్చి ప్రజల కోసం బ్రతికిన గొప్ప నాయకుడు,వంగవీటి రంగా జయంతి మరియు వర్ధంతి ప్రతి సంవత్సరం అనేక మంది అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులు అర్పిస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ సత్యనారాయణ రూబెన్ రెహాన్ సీనియర్ నాయకులు, మహిళలు, కాలనీవాసులు, అభిమానులు,యువకులు పాల్గొన్నారు

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగ..

( జూలై - 4- హంస కలంవార్త )



కేపీహెబ్, రోడ్.నెం.1 లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన విగ్రహానికి పూలమాలు లేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు. దేశభక్తికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యంఅని తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను. స్మరించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.శ్యామల రాజు, భీం రాజు, రాయల్ రాజు, నాని, రాజేష్, జున్ను సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, ఏ.ఎస్.ఆర్. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు తదితరులను పాల్గున్నారు

# స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు - ఎర్రబెల్లి సతీష్ రావు

( జూలై - 4- హంస కలంవార్త )



శనివారం రోజు స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి, వివేకానంద నగర్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన బి ఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలు, యువతకు ఆయన అందించిన స్ఫూర్తి, దేశభక్తి, సేవాభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. వారి బాటలో నడుస్తూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి. రామ కృష్ణ రాజు, విశ్వనాథ రాజు, నర్సింహ రాజు, బాపూజీ రాజు, కిషోర్, బ్రహ్మానంద రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట్ డివిజన్ జనతా నగర్ శ్రీరామ లో

( జూలై - 4- హంస కలంవార్త )



యూత్ గల్లీలో డ్రైనేజీ మ్యాన్ హోళ్ళు దెబ్బతిన్నాయని స్థానికులు మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సూపర్వైజర్ ను పిలిపించి సమస్యను వివరించారు. ఎలుకల వల్ల మ్యాన్ హోల్ పూర్తిగా మట్టితో నిండడం వల్ల డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు వివరించారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ వాటర్ వర్క్స్ సిబ్బందికి సూచించారు.అంతేకాకుండా చాలా రోజులుగా అక్కడ వీధి లైట్ వెలగడం లేదని ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మాజీ కార్పోరేటర్ దృష్టికి తీసుకెళ్లగా అక్కడిక్కడే ఎలక్ట్రికల్ అధికారులతో ఫోన్లో మాట్లాడి లైట్ ను పునరుద్ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాం, రాజు,కృష్ణ, నాయకులు కేదార్ మాణిక్, రవీందర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్"ఎయిర్‌పోర్టు"లో కీలక అడుగులు..

-సీతంపేట, సుజాతనగర్‌లే అనుకూల ప్రాంతాలుగా గుర్తింపు..

-కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడుకు నివేదిక పంపిన మంత్రి తుమ్మల

-667 ఎకరాల్లో నిర్మాణానికి అవకాశం...

-ఆరు ప్రాంతాల్లో సాధ్యాసాధ్యాల అధ్యయనం..

( జూలై - 4- హంస కలంవార్త )

దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లావాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక, ఆర్థిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో, జిల్లా యంత్రాంగం ద్వారా ప్రత్యామ్నాయ స్థలాలపై చేపట్టిన సమగ్ర సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికను వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుకు అందజేశారు. ఈ మేరకు జులై 4నమంత్రి తుమ్మల లేఖ రాశారు . గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై గతంలో తాను పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలను ఇందులో వివరించారు.

-రెండు పాత ప్రతిపాదనలకు అడ్డంకులు...

కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో ఒకటి సాంకేతికంగా, మరొకటి ఆర్థికంగా(భూసేకరణకు) అనుకూలం కాదని తేలడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సూచన మేరకు జిల్లా యంత్రాంగం స్వతంత్ర సాంకేతిక సంస్థ 'రాజ్ టెక్నాలజీస్'ను రంగంలోకి దించి, సాంకేతికంగా, ఆర్థికంగా అనుకూలమైన కొత్త స్థలాలను గుర్తించే బాధ్యతను అప్పగించింది. ఇటీవల ఢిల్లీలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలిసినప్పుడు, కొత్త స్థల ప్రతిపాదనపై పది రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నిర్దేశిత గడువులోగానే నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపడం గమనార్హం.

-ఆరు ప్రాంతాల పరిశీలన...

రెండు స్థలాలు ఖరారు ఏటీఆర్-72-600 తరహా విమానాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, భూతల స్వరూపం, రన్‌వే దిశ, ఎత్తు పరిమితి ఉపరితలాలు (అబ్‌స్టకల్ లిమిటేషన్ సర్ఫేసెస్), పర్యావరణ అంశాలు, రవాణా సౌకర్యాలను నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ ప్రాథమిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అవసరమైన కీలక సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా, అనుకూలమైన భూతలం, భూవినియోగం, నిర్వహణ పరిస్థితులతో ఉన్నట్లు తేలింది. సుమారు 667 ఎకరాల ప్రతిపాదిత అభివృద్ధి స్థలాన్ని ఎలాంటి ప్రధాన పర్యావరణ, సాంకేతిక అవరోధాలు లేకుండానే సమకూర్చవచ్చని నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఏళ్లుగా నానుతున్న స్థల నిర్ధారణ సమస్యకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

-జిల్లా ప్రాధాన్యతను వివరించిన మంత్రి...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యూహాత్మక ప్రాంతంలో ఉండటమే కాక, విశాలమైన గిరిజన, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోందని మంత్రి తుమ్మల తన లేఖలో పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు ఈ జిల్లా నిలయంగా ఉందని వివరించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి క్షేత్రానికి ఏటా లక్షలాది మంది భక్తులు దేశ, విదేశాల నుంచి తరలివస్తుంటారని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వారి ప్రయాణం మరింత సులభతరమవుతుందని తెలిపారు. అంతేకాక, జిల్లాలోని అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ప్రతిపాదిత ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని, తద్వారా పెట్టుబడులు పెరిగి విద్యా, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.ఒపూర్ణ సహకారం అందిస్తామన్న మంత్రి...ఫీజిబిలిటీ నివేదికను దయచేసి పరిగణనలోకి తీసుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల తన లేఖలో అభ్యర్థించారు. అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్రం నుంచి తుది ఆమోదం లభిస్తే, గిరిజన, పారిశ్రామిక, పుణ్యక్షేత్ర ప్రాధాన్యత కలిగిన ఈ జిల్లాకు గగనతల అనుసంధానం ఏర్పడి, ప్రాంతీయ ఆర్థిక ముఖచిత్రమే మారిపోనుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

( జూలై - 4- హంస కలంవార్త )




తెలుగు విశ్వవిద్యాలయం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నాంపల్లి క్యాంపస్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు, తెలుగు సంస్కృతి పరిరక్షకులు ,విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. విద్యార్థులు క్యాంపస్‌లో శాంతియుతంగా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, దాదాపు 30 మందికి పైగా పోలీసులు లాఠీలతో క్యాంపస్‌లోకి ప్రవేశించి మోహరించారు. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. "మేము విద్యార్థులమా? లేక రౌడీలు, కబ్జాదారులు, సంఘవ్యతిరేక శక్తులమా?" అంటూ వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రైవేట్ వ్యక్తికి మద్దతుగా వ్యవహరించడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు.దాదాపు 2,500 మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తెలుగు విశ్వవిద్యాలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రభావం నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ తెలుగు, సంస్కృతిక ద్రోహి తిరుమల రావు వ్యక్తిగత సామగ్రిని వెంటనే క్యాంపస్ నుంచి తొలగించాలని, ఆద్యకళ ఆక్రమణలో ఉన్న గదులను తక్షణమే తెలుగు విశ్వవిద్యాలయానికి అప్పగించాలని కోరారు.తెలుగు భాష, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన తెలుగు విశ్వ విద్యాలయం నాంపల్లి క్యాంపస్‌లోనే కొనసాగాలని, దానిని పరిరక్షించి అభివృద్ధి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిరక్షణ సమితి సభ్యులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా, బాచుపల్లి మరియు వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లోని విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు కూడా ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. నాంపల్లి క్యాంపస్‌ను పరిరక్షించాలని, తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లిలోనే కొనసాగాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తిరుమలరావు వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విశ్వవిద్యాలయ పరిరక్షణ ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు."తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకుందాం -- నాంపల్లిలోనే కొనసాగిద్దాం, పరిరక్షిద్దాం, అభివృద్ధి చేద్దాం" అనే నినాదాలతో మొదటి రోజు రిలే నిరాహార దీక్షలు విజయవంతంగా కొనసాగాయి.

# అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఆదర్శం జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

( జూలై - 4- హంస కలంవార్త )



మన్యం వీరుడు, గిరిజనుల ఆరాధ్య దైవం, అమర స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు కూకట్‌పల్లి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ జంక్షన్ వద్ద ఘనంగా నిర్వహించబడ్డాయి.అల్లూరి జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు అల్లూరి రామరాజు ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన మహావీరుడు అల్లూరి అని కొనియాడారు.దేశం కోసం జీవించడం, అవసరమైతే దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అల్లూరి సీతారామరాజు జీవిత సందేశమని పేర్కొన్నారు. నేటి యువత ఆయన దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగనిరతి, ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవతో పాటు దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను భావితరాలకు చేరవేసేలా అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల చరిత్రను ప్రతి ఇంటికి చేర్చే దిశగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఫణి భూషణ్,కేశవ్,అరుణ్, నర్సింగ్, గోపాల్ రావు,సాయి ఉత్సవ కమిటీ సభ్యులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్లూరి సీతారామరాజు కి ఘన నివాళులు అర్పించారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు"దొడ్డి కొమురయ్య"

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

( జూలై - 4- హంస కలంవార్త )



నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య వర్ధంతి ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం,భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు.సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు.దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సంక్షేమానికి మరో అడుగు..

-అల్లాపూర్‌లో బ్యారక్స్ ప్రారంభించిన సీపీ డా. యం. రమేష్

( జూలై - 4- హంస కలంవార్త )





పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది వసతి అవసరాల కోసం నూతనంగా నిర్మించిన బ్యారక్ లను లను శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో సమర్థవంతంగా సేవలందించాలంటే వారికి మెరుగైన వసతి, సంక్షేమ సౌకర్యాలు కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం కమిషనరేట్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నూతనంగా నిర్మించిన మహిళా, పురుషుల బ్యారక్స్ ద్వారా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన బ్యారక్స్ ప్రారంభం పట్ల అల్లాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ, పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ కి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రితిరాజ్, ఐపీఎస్, ఏసీపీ పి. నరేష్ రెడ్డి, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకట్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హంస కలం వార్త



# పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి

-కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి:

-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.

( జూలై - 4- హంస కలంవార్త )



పంట మార్పిడి విధానాలు,ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.సీఎస్ సంజయ్ జాజు శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించా మన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు.సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.యూరియా, డిఎపి,ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం తో మొదటి స్థానంలో ఉందని అన్నారు. వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని,అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.మండలాల వారిగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు.రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, వైద్య శాఖ అధికారులతో సమా వేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,డిఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

-ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

-దిశ సమావేశంలో ఎంపీ గోడం నగేశ్

( జూలై - 4- హంస కలంవార్త )



జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ పీవో మంద మకరందు,ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు,వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు,భౌతిక, ఆర్థిక పురోగతి,పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి,ఉపాధి హామీ,పంచాయతీరాజ్, వ్యవసాయం,ఐటిడిఏ, విద్యుత్,వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా,శిశు సంక్షేమం,ఉద్యానవనం, అటవీ,గిరిజన సంక్షేమం ,క్రీడలు, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు,లీడ్ బ్యాంక్ తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...కేంద్ర నిధులతో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో జాప్యానికి తావులేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.గత సమావేశం అనంతరం పనుల్లో పురోగతి కనిపించిందని,ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం,ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి జిల్లాలోని సమస్యలను సమీక్షించి పరిష్కరించాలని తెలిపారు.ప్రతి శాఖ పనితీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కారాలు చూపాలని,అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు,అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని,రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు,సమాన వేతనం అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ...ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు,సమాన వేతనం అమలు చేయాలని సూచించారు.యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు రైతులకు యూరియా యాప్ వినియోగంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా ఎలా వ్యవహరించాలి ల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో జరుగుతున్న రహదారులు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి..

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-అభివృద్ధి పనుల్లో శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి..

-రహదారుల నిర్మాణంలో నాణ్యతతో పాటు గడువుకు ప్రాధాన్యం ఇవ్వాలి..

-జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏ ర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి..

-జిల్లాలో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్..

( జూలై - 4- హంస కలంవార్త )

జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో చేపట్టిన రహదారులు, వంతెనలు, భవనాలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మిటింగ్ హాల్ లో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రహదారులు, భవనాల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల అమలులో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి పనులు, ముదిగొండ--వల్లభి ఫోర్‌లేన్ రహదారి నిర్మాణ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత మెజర్‌మెంట్ ప్రకారం చేపట్టాలని సూచించారు.ోనకల్--ఆలపాడు రహదారి నిర్మాణంలో సంబంధిత తహసీల్దార్‌కు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులను పూర్తి చేసేలా




చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని అభివృద్ధి పనులు, ఏర్పాట్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ˇమావేశంలో అధికారులు తమ పరిధిలోని పనుల పురోగతిని వివరించగా, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబీ ఎస్ఈ యుగంధర్, ఈఈ బషీర్, సీతారామయ్య, డిఈ భగవాన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## వానకాలం వ్యవసాయ సాగుకు సన్నద్ధం కావాలి

-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



( జూలై - 4- హంస కలంవార్త )

రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సాగుకు అధికార యంత్రంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వ్యవసాయం,విత్తనాలు, ఎరువులు,ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు రిజిస్ట్రీ,త్రాగునీరు, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో వానాకాలం-2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు రైతులను సమన్వయం చేసుకుంటూ సన్నద్ధం కావాలని తెలిపారు. రాష్ట్రంలో 138.49 లక్షల ఎకరాలలో సాగు లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, రైతులకు అవసరమైన మేరకు 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని 68 మందిని అరెస్టు చేసి, 34 క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ ఉంచాలని,యూరియా అక్రమ రవాణా,అధిక ధరలకు విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని,నానో యూరియా వినియోగాన్ని కూడా విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని, అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ,ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలులో జిల్లాల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని 33 జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి,జిల్లా,డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సున్నిత ప్రాంతాలలో జ్వరాలపై ప్రత్యేక నిఘా చేపట్టి,ప్రతిరోజూ నివేదికలు పంపాలని, ప్రతి శుక్రవారం"డ్రై డే" కార్యక్రమం నిర్వహిస్తూ దోమల నివారణ చర్యలు,లార్వా నిర్మూలన,ఫాగింగ్,నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో శుభ్రత కార్యక్రమాలను ముమ్మరం చేయాలని తెలిపారు.పట్టణాలు, గ్రామాలు,పాఠశాలలు, వసతి గృహాలు, నిర్మాణ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లు చేపట్టాలని,గత ఏడాదితో పోలిస్తే డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ,టైఫాయిడ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని,ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రులలో మందులు,పరీక్షా కిట్లు, రక్త నిల్వలు,అంబులెన్స్ సేవలు,అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజారోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్య,ఐసీడీఎస్,గిరిజన సంక్షేమ,రెవెన్యూ శాఖలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం,త్రాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రత, ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు.పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, ఆహార తయారీ నుంచి పంపిణీ వరకు పరిశుభ్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఆధారంగా ఆహార అవసరాలను అంచనా వేసి వ్యర్థాలను నివారించాలని తెలిపారు.ఆహార నాణ్యత,పంపిణీ, పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డ్‌ను సమర్థంగా వినియోగించాలని, జిల్లా కలెక్టర్లు పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వానాకాలంలో రైతులకు,విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వానకాలం వ్యవసాయ సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగులో అవసరమైన మెలకువలు అందించడం జరుగుతుందని, రైతు నమోదు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్రాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు,జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, మిషన్ భగీరథ ఈ.ఈ., సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్

## ఇవాళ అరంగేట్రం ఖాయమా? వైభవ్ పోస్ట్ అర్థమేంటి?

**-'కొత్త అధ్యాయం' అంటూ వైభవ్ సూర్యవంశీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ**
**-ఇంగ్లండ్‌తో రెండో టీ20లో అరంగేట్రం చేయవచ్చని ఊహాగానాలు**
**-ఫామ్ కోల్పోయిన సంజూ శాంసన్‌పై వేటు పడే అవకాశం**
**-నెట్స్‌లో వైభవ్ ప్రదర్శన అద్భుతమని బౌలింగ్ కోచ్ మోర్కెల్ ప్రశంస**




ఇంగ్లండ్‌తో ఇవాళ జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌లో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీమిండియా తరఫున అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'కొత్త అధ్యాయం' అనే క్యాప్షన్‌తో అతను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక స్టోరీ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. యూకే పర్యటనలో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20లు, ఇంగ్లండ్‌తో వర్షం కారణంగా రద్దయిన తొలి టీ20లోనూ వైభవ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు తన సమయం ఆసన్నమైందని అతను పరోక్షంగా సంకేతాలిచ్చాడు. అయితే, వైభవ్‌ను జట్టులోకి తీసుకురావడానికి తొందరపడాల్సిన అవసరం లేదని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అభిప్రాయపడ్డాడు. నిన్న జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జట్టులో ఉన్న ఆటగాళ్లకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. "టీ20 క్రికెట్‌లో మన నెం.1 బ్యాటర్ అయిన అభిషేక్ శర్మ, టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజూ శాంసన్‌లను మనం గౌరవించాలి. కోచింగ్ సిబ్బందిగా, ఆటగాళ్లపై విశ్వాసం చూపడం, వారికి మద్దతు ఇవ్వడం మా ధర్మం. ఒక యువ ఆటగాడు తలుపు తడుతున్నాడనేది నిజంగా ఉత్సాహాన్నిచ్చే విషయమే. కానీ, ప్రస్తుత ఆటగాళ్లకు అండగా నిలవడం చాలా ముఖ్యం" అని మోర్కెల్ వివరించాడు. ప్రపంచకప్‌లు గెలిచిన, కఠిన పరిస్థితుల్లో రాణించిన ఆటగాళ్లకు అండగా నిలవడం ద్వారానే జట్టును మరింత బలోపేతం చేయగలమని మోర్కెల్ పేర్కొన్నాడు. ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపాలన్నాడు. మరోవైపు వైభవ్ సూర్యవంశీ ప్రతిభను మోర్కెల్ ప్రశంసించాడు. "అంతర్జాతీయ స్థాయిలో 15 ఏళ్ల వయసులో నెట్స్‌లో ఆడటం భయపెట్టే విషయమే అయినా, వైభవ్ మమ్మల్ని చాలా ఆకట్టుకున్నాడు. మేము చూసిన కొన్ని నెట్ సెషన్లలోనే అతను అద్భుతంగా రాణించాడు. అతడి నెట్ ప్రాక్టీస్ వీడియోలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జట్టులో అతను సులభంగా కలిసిపోయాడు. అవకాశం వచ్చినప్పుడు, అతను దానికి సిద్ధంగా ఉంటాడని నేను కచ్చితంగా చెప్పగలను" అని మోర్కెల్ అన్నాడు. ఈ నేపథ్యంలో ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న సంజూ శాంసన్‌ను పక్కన పెట్టి వైభవ్‌కు అవకాశం ఇస్తారేమోనని విశ్లేషకులు భావిస్తున్నారు. యూకే పర్యటనలో గత మూడు ఇన్నింగ్స్‌లలో సంజూ కేవలం 5, 0, 1 పరుగులు మాత్రమే చేశాడు. దీంతో యువ ప్రతిభకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో టీమ్ మేనేజ్‌మెంట్ సంజూపై వేటు వేసే అవకాశం లేకపోలేదు. తుది నిర్ణయం టీమ్ మేనేజ్‌మెంట్‌దే కావడంతో రెండో టీ20లో తుది జట్టు కూర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## నాన్న ఆ ఒక్క నిర్ణయం తీసుకోకపోతే.. తన కెరీర్ మలుపుపై సంజూ శాంసన్ భావోద్వేగం



కేరళ తరఫున ఆడటం మొదలుపెట్టానని వివరణ ఢిల్లీ పోలీస్ క్వార్టర్స్‌లో గల్లీ క్రికెట్‌తో తన ప్రయాణం మొదలైందని గుర్తుచేసుకున్న శాంసన్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన తన తండ్రి, తనలోని టాలెంట్ గుర్తించి క్రికెట్ వైపు ప్రోత్సహించారని వెల్లడి టీమిండియా డ్యాషింగ్ బ్యాటర్ సంజూ శాంసన్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులు, తన తండ్రి తీసుకున్న ఓ సాహసోపేత నిర్ణయం తన జీవితాన్ని ఎలా మార్చిందీ వెల్లడించాడు. ఢిల్లీ క్రికెట్ సర్క్యూట్‌లో చోటు కోసం తీవ్రంగా శ్రమించి విఫలమైనప్పుడు, తన తండ్రి విశ్వనాథన్ అప్పటికప్పుడు కుటుంబాన్ని కేరళకు మార్చాలని తీసుకున్న నిర్ణయమే తన కెరీర్‌కు కీలక మలుపు అని గుర్తుచేసుకున్నాడు. జియోస్టార్ నిర్వహించిన 'సూపర్‌స్టార్స్' కార్యక్రమంలో శాంసన్ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. ఢిల్లీలో తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుంటూ.. "నిజాయతీగా చెప్పాలంటే నా జీవితంలో ఢిల్లీ చాలా పెద్ద పాత్ర పోషించింది. నాన్న ఢిల్లీ పోలీస్ ఫుట్‌బాల్ జట్టులో ఉండేవారు. పోలీస్ క్వార్టర్స్‌లో ఉండటంతో అక్కడి వాతావరణం నన్ను క్రీడల వైపు ఆకర్షించింది. స్నేహితులు డీడీసీఏ జాకెట్లు వేసుకుని రాష్ట్ర జట్టుకు ఆడటం గురించి మాట్లాడుతుంటే, నాకూ ఢిల్లీ తరఫున ఆడాలనే కోరిక కలిగింది. దీని కోసం ట్రయల్స్‌కు వెళ్లాను, స్టేట్ క్యాంపుల్లో పాల్గొన్నాను, పరుగులు కూడా చేశాను" అని శాంసన్ తెలిపాడు. అయితే, తీవ్రమైన పోటీ కారణంగా తనకు అవకాశం రాలేదని వివరించాడు. 'రెండు మూడు సార్లు క్యాంపులకు ఎంపికయ్యాను. కానీ, రాష్ట్ర జట్టులో మాత్రం చోటు దక్కలేదు. ఒకరోజు ట్రయల్స్ ముగిశాక తుది జట్టు జాబితా ప్రకటించారు. అందులో నా పేరు లేదు. మేమంతా మౌనంగా ఇంటికి వచ్చాం. ఇంటికి చేరుకోగానే నాన్న అమ్మతో, 'మనం కేరళకు వెళ్లాలి. సామాన్లు సర్దుకోండి' అన్నారు. అమ్మ ఆశ్చర్యపోయి, 'పిల్లలు ఇంకా 6వ తరగతిలోనే ఉన్నారు. కనీసం 10వ తరగతి పూర్తి చేయనివ్వండి' అంది. కానీ నాన్న, 'లేదు, మనం ఇప్పుడే వెళ్లాలి. మూడు రోజుల్లో టిక్కెట్లు బుక్ చేస్తున్నా' అని తక్షణమే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత మేమంతా రైలెక్కి కేరళకు చేరుకున్నాం. అలా కేరళ రాష్ట్ర జట్టు తరఫున నా క్రికెట్ ప్రయాణం మొదలైంది" అని శాంసన్ భావోద్వేగంతో చెప్పాడు. తన తండ్రి ఫుట్‌బాల్ ప్లేయర్ అయినప్పటికీ, తనలోని క్రికెట్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారని శాంసన్ తెలిపాడు. "నాన్న నన్ను ఫుట్‌బాల్ వైపు ఎప్పుడూ బలవంతం చేయలేదు. నా బ్యాటింగ్ చూసి, 'నీలో టాలెంట్ ఉంది' అని నన్ను, మా అన్నను క్రికెట్ ఆడమని ప్రోత్సహించారు" అని అన్నాడు. ఫిరోజ్ షా కోట్లా (ప్రస్తుతం అరుణ్ జైట్లీ స్టేడియం) మైదానంతో ముడిపడి ఉన్న ఒక మధుర జ్ఞాపకాన్ని కూడా సంజూ పంచుకున్నాడు. "ఒకరోజు నాన్న నన్ను ప్రాక్టీస్ కోసం ఫిరోజ్ షా కోట్లాకు తీసుకెళతానన్నారు. అక్కడ ఆయనకు డ్యూటీ ఉండటంతో ఒక గంట ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి కోరారు. అలా నేను, మా అన్నయ్య, నాన్న కలిసి నెట్స్‌లో గంటసేపు ప్రాక్టీస్ చేశాం. అది దేవుడి ఆశీర్వాదంలా భావిస్తాను. ఆ రోజు నాన్న అది ఎలా మేనేజ్ చేశారో తెలియదు కానీ, అదొక మర్చిపోలేని అనుభూతి" అని సంజూ శాంసన్ తన పాత రోజులను గుర్తుచేసుకున్నాడు.

# బిజినెస్

## ఐఫోన్ 18 సిరీస్‌లో ఊహించని మార్పు.. యాపిల్ చరిత్రలోనే అత్యంత భారీ బ్యాటరీతో..!




**-ఐఫోన్ 18లో భారీ బ్యాటరీల ఏర్పాటు**
**-ఫిజికల్ సిమ్ స్లాట్ తొలగింపు నిర్ణయం**
**-ఈ-సిమ్‌తో పెరగనున్న అంతర్గత స్థలం**
**-ఏఐ వినియోగానికి తగ్గట్టుగా డిజైన్**
**-ప్రో మాక్స్‌లో రికార్డు స్థాయి బ్యాటరీ**

యాపిల్ సంస్థ తదుపరి తరం స్మార్ట్‌ఫోన్ సిరీస్ 'ఐఫోన్ 18'పై అప్పుడే టెక్ ప్రపంచంలో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాబోయే ఐఫోన్ 18, ఐఫోన్ 18 ప్లస్, ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడళ్లలో బ్యాటరీ సామర్థ్యాన్ని భారీగా పెంచేందుకు యాపిల్ కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా, ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడల్‌లో యాపిల్ చరిత్రలోనే ఇప్పటివరకు లేనంత అతిపెద్ద బ్యాటరీని అమర్చనున్నట్లు పరిశ్రమ నివేదికల ద్వారా లీకైన సమాచారం వెల్లడిస్తోంది. ఫోన్ మందాన్ని పెంచకుండానే బ్యాటరీ సామర్థ్యాన్ని పెంచడానికి యాపిల్ ఇంజనీర్లు ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. ఇందులో భాగంగా భౌతికమైన సిమ్ కార్డ్ ట్రేని పూర్తిగా తొలగించి, కేవలం 'ఈ-సిమ్' సాంకేతికతకే పరిమితం కానున్నట్లు తెలుస్తోంది. సిమ్ స్లాట్ తొలగించడం వల్ల ఫోన్ లోపల లభించే అదనపు ఖాళీ స్థలాన్ని బ్యాటరీ పరిమాణాన్ని పెంచడానికి, అంతర్గత భాగాల అమరికను మెరుగుపరచడానికి ఉపయోగించనున్నారు. స్మార్ట్‌ఫోన్‌లలో ఆన్-డివైజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హై-రిఫ్రెష్ రేట్ ఓఎల్ఈడీ స్క్రీన్‌లు, హెవీ కెమెరా ప్రాసెసింగ్ వల్ల బ్యాటరీ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆండ్రాయిడ్ ఫ్లాగ్‌షిప్ ఫోన్ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా యాపిల్ బ్యాటరీ లైఫ్‌కు ఈసారి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ-సిమ్ టెక్నాలజీ వల్ల హార్డ్‌వేర్ అమరిక సులువవడమే కాకుండా, ఫోన్‌కు వాటర్ రెసిస్టెన్స్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. వీటితో పాటు సరికొత్త యాపిల్ సిలికాన్ చిప్స్, స్లిమ్ లాజిక్ బోర్డులు, అధునాతన హీట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలను ఈ సిరీస్‌లో ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మార్కెట్లోకి రానున్న ఈ ఐఫోన్ 18 సిరీస్ ముఖ్యంగా భారతీయ వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. నిరంతరం మొబైల్ డేటా, వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ పేమెంట్స్ వాడుతూ ప్రయాణాలు చేసే భారతీయులకు దీర్ఘకాలం మన్నే ఈ బ్యాటరీ ఎంతో వెసులుబాటును ఇస్తుంది. అయితే భారత్‌లో ప్రిపెయిడ్, బడ్జెట్ ప్లాన్లలో ఈ-సిమ్ సేవలు అన్ని నెట్‌వర్క్‌లలో ఒకేలా లేనందున, కేవలం ఈ-సిమ్ వేరియంట్లు మాత్రమే విడుదలైతే ఇక్కడి వినియోగదారులు తమ టెలికాం ప్లాన్లను సరిచూసుకోవాల్సి ఉంటుంది.

## భారత ఈ20 పెట్రోల్‌కు భూటాన్ నో.. కారణం ఇదే!

**-సాధారణ పెట్రోల్‌నే కొనసాగించాలని భారత్‌ను కోరిన భూటాన్**
**-పాత భూగర్భ ఇంధన ట్యాంకులు ఈ20కు అనుకూలం కావని వివరణ**
**-ఇథనాల్ తేమను పీల్చుకోవడంతో ఇంధనం కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన**
**-కొండ ప్రాంతాల్లో వాహనాల పనితీరుపై కూడా భూటాన్‌కు ఆందోళన**
**-భవిష్యత్తులో ఈ25 అమలుకు ముందే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి**




ఇంధనంలో ఇథనాల్ వినియోగాన్ని పెంచేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తున్న వేళ.. పొరుగుదేశం భూటాన్ మాత్రం ఈ20 పెట్రోల్‌ను తిరస్కరించింది. సాధారణ పెట్రోల్‌నే సరఫరా చేయాలని భారత చమురు మార్కెటింగ్ సంస్థలను కోరింది. ఇందుకు భూటాన్ పేర్కొన్న కారణాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. భూటాన్‌లోని పాత భూగర్భ ఇంధన నిల్వ ట్యాంకులు ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా లేవని అక్కడి ప్రభుత్వం తెలిపింది. ఇథనాల్ తేమను సులభంగా పీల్చుకునే గుణం కలిగి ఉండటంతో ట్యాంకుల్లోకి నీరు చేరితే ఇంధనం కలుషితమయ్యే ప్రమాదం ఉందని వివరించింది. దీంతో వాహనాల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. భూటాన్‌లో ఎక్కువ ప్రాంతాలు కొండలు, ఎత్తైన రహదారులతో ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో వాహనాలకు పూర్తి శక్తి అవసరమవుతుందని, ఈ20 పెట్రోల్ అదే స్థాయి పనితీరును అందిస్తుందో లేదో అన్న సందేహం కూడా అధికారుల్లో ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. భూటాన్ మరో విజ్ఞప్తి కూడా చేసింది. భవిష్యత్తులో భారత్ ఈ25 లేదా పూర్తిగా ఇథనాల్ ఆధారిత ఇంధనానికి మారితే ముందుగానే సమాచారం ఇవ్వాలని కోరింది భూటాన్ తనకు అవసరమైన మొత్తం పెట్రోల్, డీజిల్‌ను భారత్ నుంచే దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారతీయ పెట్రోల్ బంకుల్లో లభించే ఇంధనం కాకుండా, ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే నాణ్యమైన ఇంధనాన్ని కొనుగోలు చేస్తోంది. భారత్‌లో ఈ20 పెట్రోల్‌పై ఇప్పటికే చర్చ కొనసాగుతోంది. 2023కు ముందు తయారైన కొన్ని పెట్రోల్ వాహనాల యజమానులు మైలేజీ తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం మైలేజీ కొంత తగ్గినా ఇంజిన్ పనితీరు, యాక్సిలరేషన్ మెరుగుపడతాయని చెబుతోంది.

## నేను పక్కా తెలుగువాడినిః శ్రీమాన్



వెంకటేశ్, కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి చిత్రంలో నటిస్తున్న శ్రీమాన్ మాతృభాషలో నటించడాన్ని నమ్మలేక పోతున్నానని వ్యాఖ్య తెలుగు ప్రేక్షకులు తనను గుర్తుపడతారన్న శ్రీమాన్ తమిళ సినిమా పరిశ్రమలో వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న నటుడు శ్రీమాన్. ఇప్పుడు తన మాతృభాష అయిన తెలుగులో ఆయన నేరుగా సినిమా చేస్తున్నారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కామెడీ చిత్రంలో ఒక వారం షూటింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీమాన్ తన ఎక్స్ ఖాతాలో భావోద్వేగంతో కూడిన పోస్ట్ చేశారు. "భగవంతుడికి ధన్యవాదాలు. అనిల్ గారికి థ్యాంక్స్. ఒక వారం షూటింగ్ పూర్తయింది. నా మాతృభాషలో నటిస్తున్నాననే విషయం నమ్మలేకపోతున్నా. సెట్ మీద పాజిటివ్ ఎనర్జీ, కామెడీ రోలర్ కోస్టర్.. అద్భుతమైన టీమ్‌తో పని చేయడం ఆశీర్వాదం" అని రాశారు. తాను తూర్పు గోదావరి జిల్లా గొల్లల మామిడాడకు చెందిన తెలుగు అబ్బాయినని... కానీ, తెలుగు సినిమాల్లో తన పేరు సరిగ్గా గుర్తింపుకు రాలేదని శ్రీమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఎయిర్‌పోర్టులో, రైల్వే స్టేషన్లలో తెలుగు ప్రేక్షకులు నన్ను గుర్తుపడతారు, పొగిడేస్తారు. కానీ చివరికి 'మీ పేరేమిటి సార్?' అని అడుగుతారు. ఇన్ని సినిమాలు చేసినా నా పేరు ఇక్కడ రిజిస్టర్ కాలేదు" అని భావోద్వేగం వ్యక్తం చేశారు. అనిల్ రావిపూడి సినిమాలంటే తనకు ఎప్పటినుంచో ఇష్టమని, ఈ అవకాశం కోసం కొన్ని తమిళ సినిమాలను కూడా పక్కన పెట్టి వచ్చానని శ్రీమాన్ తెలిపారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్, కీర్తి సురేశ్‌లతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు 'శ్రీమాన్ ఒక తెలుగు వ్యక్తి' అని పూర్తిగా తెలిసిపోతుందని ఆయన ధీమాగా చెప్పారు. శ్రీమాన్ అసలు పేరు కుమారావత శ్రీనివాసరెడ్డి కావడం గమనార్హం. ఆయన తండ్రి ప్రకాశ్ రెడ్డి నిర్మాతగా పలు చిత్రాలు నిర్మించారు.

# కూతురి పుట్టినరోజు నాటి జ్ఞాపకం.. అరుదైన ఫోటో షేర్ చేసిన రవి కిషన్

కూతురు రివ్వా పుట్టినరోజున రవి కిషన్ ప్రత్యేక పోస్ట్ అరుదైన పాత కుటుంబ ఫొటోను షేర్ చేసిన నటుడు భార్య, చిన్నారి రివ్వాతో ఉన్న జ్ఞాపకాన్ని పంచుకున్న రవి కిషన్ ఇటీవల రియాలిటీ షోలో కలిసి కనిపించిన తండ్రీకూతుళ్లు ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు రవి కిషన్ తన కుమార్తె రివ్వా కిషన్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక అరుదైన పాత చిత్రాన్ని పంచుకున్నారు. ఈ ఫొటో ద్వారా ఆయన తన పితృత్వపు తొలినాళ్ల జ్ఞాపకాలను నెమరువే





సుకున్నారు. ఈ చిత్రంలో యువకుడైన రవి కిషన్ తన భార్య ప్రీతి కిషన్ శుక్లాతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ప్రీతి ఒడిలో చిన్నారి రివ్వా ఉన్నారు. ఈ ఫొటోను షేర్ చేస్తూ రవి కిషన్ ఒక భావోద్వేగ సందేశాన్ని రాశారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు రివ్వా. ఆ మహాదేవుడు నిన్ను ఆశీర్వదించి, సన్మార్గంలో నడిపిస్తూ సదా రక్షించాలి. నిన్ను చూసి నేను గర్వపడుతున్నాను. నువ్వే నా స్టార్‌వి, ఇలాగే నిరంతరం ప్రకాశిస్తూ ఉండు" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల రివ్వా తన తండ్రి రవి కిషన్‌తో కలిసి 'అలయన్స్' అనే రియాలిటీ గేమ్ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రవి కిషన్ తన నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, 1990లలో ఎదుర్కొన్న సవాళ్లను, 34 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత లభించిన విజయాన్ని వివరిస్తూ అందరికీ స్ఫూర్తినిచ్చారు. ఆయన పంచుకున్న అనుభవాలు అక్కడి కంటెస్టెంట్లను ఎంతగానో కదిలించాయి. ప్రస్తుతం రవి కిషన్ చేసిన ఈ బర్త్‌డే పోస్ట్ సోషల్ మీడియాలో నెటిజన్లను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నిత్యం రాజకీయ, సినీ కార్యక్రమాలతో బిజీగా ఉండే ఆయన వ్యక్తిగత జీవితంలోని ఈ మధురమైన కోణాన్ని చూసి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నటనలో పర్ఫెక్షనిస్ట్.. ఆస్తుల సంపాదనలోనూ మాస్టర్.. ఆమిర్ ఖాన్ వేల కోట్ల సామ్రాజ్యంపై ఓ లుక్కేయండి!

రూ.1862 కోట్లుగా ఆమిర్ ఖాన్ నికర ఆస్తుల విలువ త్వరలో మూడో పెళ్లికి సిద్ధమవుతున్న మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ముంబై, పంచగనితో పాటు అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లోనూ ఖరీదైన నివాసాలు రోల్స్ రాయిస్, బెంట్లీ సహా రూ.10 కోట్లకు పైగా విలువైన కార్ల కలెక్షన్ తన పూర్వీకుల గ్రామంలో 22 ఇళ్లను కొనుగోలు చేసిన ఆమిర్ సినిమాల విషయంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించే బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్, ఆస్తులను కూడబెట్టడంలోనూ అంతే పక్కాగా వ్యవహరిస్తారు. ఎన్డీటీడీ కథనం ప్రకారం... త్వరలో ఫ్యాషన్ ప్రొఫెషనల్ గౌరీ స్ప్రాట్‌తో పెళ్లికి సిద్ధమవుతున్న వేళ, ఆయన వేల కోట్ల రూపాయల ఆస్తుల వివరాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ముంబైలోని బాంద్రా నివాసంలో జరగనున్న ఈ పెళ్లి వేడుక కోసం ఇంటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ ఆస్తుల విలువ, విలాసవంతమైన నివాసాలు, కార్ల కలెక్షన్‌పై ఓ లుక్కేద్దాం.

### రూ.1,862 కోట్ల అధిపతి

బాలనటుడిగా కెరీర్ ప్రారంభించి, ఐదు దశాబ్దాలుగా వినోద పరిశ్రమలో కొనసాగుతున్న ఆమిర్ ఖాన్ 50కి పైగా చిత్రాల్లో నటించారు. నటనతో పాటు 1999లో 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ (ఏకేపీ)' పేరుతో నిర్మాణ సంస్థను స్థాపించి విజయవంతమైన నిర్మాతగానూ నిలిచారు. ఫస్ట్‌పోస్ట్ నివేదిక ప్రకారం, 2024 జులై నాటికి ఆమిర్ నికర ఆస్తుల విలువ సుమారు రూ.1,862 కోట్లు.

### ముంబై నుంచి అమెరికా వరకు ఆస్తులు

ఆమిర్ ఖాన్‌కు ముంబైలో పలు ఖరీదైన ఆస్తులు ఉన్నాయి. ఆయన పెళ్లి చేసుకోబోతున్న బాంద్రాలోని సముద్రానికి అభిముఖంగా ఉన్న 5,000 చదరపు అడుగుల ఇంటిని 2013లో రూ.60 కోట్లకు కొనుగోలు చేశారు. దీంతో పాటు ముంబైలోని హిల్ వ్యూ, బెల్లా విస్టా, మెరీనా అపార్ట్‌మెంట్లలోనూ ఆయనకు పలు ఫ్లాట్లు ఉన్నాయి. కేవలం ముంబైకే పరిమితం కాకుండా హాలీవుడ్ తారలు నివసించే అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లోనూ ఆమిర్ ఖాన్‌కు ఒక విలాసవంతమైన భవంతి ఉంది. దీని విలువ సుమారు రూ.75 కోట్లు. పుణె సమీపంలోని పంచగనిలో 2 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఫామ్‌హౌస్ కూడా ఆయన సొంతం. దీని విలువ సుమారు రూ.7 కోట్లు.

### పూర్వీకుల గ్రామంతో అనుబంధం

ఇవే కాకుండా ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లా, షాహాబాద్‌లోని తన పూర్వీకుల గ్రామంలో ఆమిర్ ఖాన్ ఏకంగా 22 ఇళ్లను కొనుగోలు చేశారు. తన బంధువులు ఆ ఇళ్లను అమ్మాలనుకుంటున్నారని తెలిసి, తానే వాటిని కొన్నట్లు ఆయన గతంలో తెలిపారు. "ఇది నా పూర్వీకుల ఊరు కాబట్టి, భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం. ఎప్పటికైనా వ్యవసాయం చేయాలన్నది నా కోరిక. ఈ భూమి వ్యవసాయానికి అనుకూలంగా ఉంది" అని ఆమిర్ ఒక సందర్భంలో వివరించారు.

### విలాసవంతమైన కార్ల కలెక్షన్

ఆమిర్ ఖాన్ గ్యారేజీలో అత్యంత ఖరీదైన కార్లు ఉన్నాయి. వాటిలో రూ.6.95 కోట్ల నుంచి రూ.7.95 కోట్ల మధ్య విలువైన రోల్స్ రాయిస్ ఘోస్ట్ ఒకటి. అంతేగాక సుమారు రూ.10.5 కోట్ల విలువైన ప్రత్యేకంగా కస్టమైజ్ చేయించుకున్న మెర్సిడెస్ బెంజ్ ఎస్600 కూడా ఆయన వద్ద ఉంది. వీటితో పాటు బెంట్లీ కాంటినెంటల్, బీఎండబ్ల్యూ 6-సిరీస్, టయోటా వెల్‌ఫైర్, మహీంద్రా ఎక్స్‌యూవీ500 వంటి లగ్జరీ కార్లు కూడా ఆయన కలెక్షన్‌లో ఉన్నాయి. నటుడిగా, నిర్మాతగా దశాబ్దాల పాటు తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆమిర్ ఖాన్, పెట్టుబడుల విషయంలోనూ ముందుచూపుతో వ్యవహరించి భారీ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు.






## లోకేశ్ కనగరాజ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రెజీనా!

నిర్మాతగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్న లోకేశ్ కనగరాజ్ లేడీ ఓరియెంటెడ్ సినిమాను నిర్మించబోతున్న లోకేశ్! ప్రధాన పాత్రను పోషించబోతున్న రెజీనా! కోలీవుడ్‌లో హిట్ డైరెక్టర్‌గా గుర్తింపు సాధించిన లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నిర్మాతగా మరో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ', 'లియో' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన లోకేశ్... హీరోగా 'డీసీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆయన నిర్మాతగా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటించబోతోందట. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయిందని, సినిమా షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని చెబుతున్నారు. లోకేశ్ కనగరాజ్ 'డీసీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ, తన తదుపరి ప్రాజెక్టులపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. డైరెక్టర్‌గా, హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా సినిమా ఇండస్ట్రీలో తన ముద్ర వేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రం ద్వారా రెజీనా కసాండ్రా మరో మంచి అవకాశం కొట్టేసిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## థియేటర్లలో రికార్డులు.. ఇక ఓటీటీలో 'పెద్ది' హంగామా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..!



ఓటీటీలోకి రాబోతున్న రామ్ చరణ్ 'పెద్ది' జులై 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ ఈ ఏడాది టాలీవుడ్‌లో హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచిన చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రం ఇప్పుడు ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయం సాధించిన ఈ సినిమా, ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో జులై 9 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను జులై 9న విడుదల చేయనున్నారు. అయితే, హిందీ వెర్షన్ మాత్రం ఆగస్టులో అందుబాటులోకి రానుంది. దక్షిణాది భాషలకు ఐదు వారాల థియేట్రికల్ విండో తర్వాత ఈ చిత్రాన్ని ఓటీటీలో రిలీజ్ చేస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఈ ఏడాది టాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449